## ప్రణాళిక ప్రకారం ఎన్యూమరేషన్ ఫారాలు

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్ జిల్లాల్లో ఎస్ ఐ ఆర్ ప్రక్రియ, ఫారాల పంపిణీ, డిజిటలైజేషన్ లో వేగం పెంచాలని సూచించారు. ఉత్తమ ప్రతిభ చూపి ఫారాల పంపిణీ, డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతం చేస్తున్న పలువురు జిల్లాల కలెక్టర్లతో మాట్లాడి.. వారు అనుసరించిన విధానాలు తెలుసుకున్నారు. జిల్లాల కలెక్టర్లు బీ ఎల్ ఓ లతో మాట్లాడి ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయించాలని ఆదేశించారు. పనితీరులో వెనుకబడిన బీఎల్ఓలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, వారికి సహాయకులను నియమించి.. ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. గడువు తేదీ లోగా డిజిటలైజేషన్ పూర్తి చేయాలని భారత ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ ఆదేశించారు.

### బీఎల్ఓలకు లక్ష్యం నిర్ణయించి ముందుకు వెళ్లాలి

ఎస్ ఐ ఆర్ లో భాగంగా ప్రతి బూత్ లెవల్ అధికారి (బీఎల్ఓ)లకు లక్ష్యం నిర్ణయించి ముందుకు వెళ్లేలా ఆదేశాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధి, గ్రామాల్లో కూడా హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, సిరిసిల్ల ఆర్డీఓ శ్రీధర్ బాబు, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత, ఏఈఆర్ఓ లు మహేష్, జయంత్, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## వేగవంతంగా భూముల.. సర్వే ప్రక్రియ చేపట్టాలి

(మొదటి పేజీ తరువాయి)

జిల్లాలో సుమారు 94,637 ఎకరాల భూముల సర్వే చేపట్టనున్నట్లు పేర్కొన్న కలెక్టర్, ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయడానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని, బీఎల్వోలు ఇంటింటికి వెళ్లి ప్రతి ఓటరిని చేరుకోవాలని ఆదేశించారు. గృహ నిర్మాణ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం మరియు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిపై సమీక్షించి, నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో కరీంనగర్, హుజూరాబాద్ ఆర్డీవోలు షర్మిల, జలకుమారి, గృహ నిర్మాణ శాఖ అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు మోబిన్, కాళీచరణ్, మాధవితో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వాసవి మినీ థియేటర్ ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్

**ప్రజాపక్షం / జమ్మికుంట :** జమ్మికుంట పట్టణంలోని కొండూరు కాంప్లెక్స్‌లో భారత గ్యాస్ ఆఫీస్ పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన వాసవి మినీ ప్రైవేట్ థియేటర్ ను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ ప్రారంభించారు. తంగళ్లపల్లి శ్యామ్ కిషోర్ లకు కిషోర్ శుభాకాంక్షలు తెలిపారు. పుట్టిన రోజు, వివాహ వార్షికోత్సవాలు, కుటుంబ వేడుకలు, స్నేహితుల ప్రత్యేక సమావేశాలు వంటి కార్యక్రమాలను ప్రైవేట్ వాతావరణంలో నిర్వహించుకునే ఈ థియేటర్ అందుబాటులో ఉందని తెలిపారు.

## అన్న అక్క మెంటర్‌షిప్ ఎఐ డిజిటల్ లెర్నింగ్ తరగతులు

**ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ :** తెలంగాణ ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన అన్న అక్క మెంటర్‌షిప్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎస్సారార్ ప్రభుత్వ అటానమస్ కళాశాలకు చెందిన బీకాం, బిబిఏ ఐదవ సెమిస్టర్ విద్యార్థులు బీకాం ఆర్ట్స్ మూడవ సెమిస్టర్ విద్యార్థులు కరీంనగర్ జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలో ఏఐ డిజిటల్ లెర్నింగ్ శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కల్వకుంట రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ఆధునాతన సాంకేతిక ప్రపంచానికి సంసిద్ధం చేయడానికి తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతిష్ఠాత్మక కార్యక్రమం అని ఎస్సారార్ కళాశాలకు చెందిన ఐదవ సెమిస్టర్ విద్యార్థులు తాము చదువుకుంటూ పాఠశాల విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డిజిటల్ లెర్నింగ్‌పై మార్గదర్శనం చేస్తున్నారని తెలిపారు. అన్న అక్క మెంటర్‌షిప్ జిల్లా నోడల్ అధికారి మధు రాజేశ్ మాట్లాడుతూ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాఠశాల విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టూల్స్ అండ్ అప్లికేషన్స్ కోడింగ్, పైథాన్ లాంగ్వేజ్, డిజిటల్ లర్నింగ్, కంప్యూటేషనల్ థింకింగ్ వంటి అంశాలపై మార్గదర్శనం చేస్తున్నారని దీనిని పాఠశాల విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఏఐ అప్లికేషన్స్ అభివృద్ధి చేసే స్థాయికి ఎదగాలని కోరారు. కళాశాల కామర్స్ విభాగ నోడల్ అధికారి డా.మల్లారెడ్డి మాట్లాడుతూ ఎస్సారార్ కళాశాలకు చెందిన కామర్స్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ ఐదవ సెమిస్టర్ విద్యార్థులు కరీంనగర్ జిల్లాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొత్తపల్లి, వెలిచాల, గట్టుభూత్కూర్ ఆదర్శ పాఠశాల, కేజీబీవీ పాఠశాల రామడుగు మొదలైన ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డిజిటల్ లెర్నింగ్ శిక్షణ తరగతులను ప్రారంభించారని ఇది సెప్టెంబర్ 30వ తేదీ వరకు 30 గంటలు బోధించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ టి.రాజయ్య, ఉన్నత విద్య ఐకాస చైర్మన్ డా.కదారు సురేందర్ రెడ్డి, కళాశాల నోడల్ అధికారులు మధు రాజేశ్, డా.ఎం.మల్లారెడ్డి, ఎం.అంజనేయులు, గుర్రం రాజేందర్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కళాశాల స్టాఫ్ క్లబ్ సెక్రటరీ డా.ఎం.శ్రీనివాస్ రెడ్డి, ఐక్యూ ఏసీ సమన్వయకర్త డా.హర్ జ్యోతికౌర్, సమన్వయకర్తలు డా.కే.అర్జున్, ఎం.శిరీష బి.నర్మద, రాజు, శిరీష, విక్టోరియా రాణి, రిష్లిక, విద్యార్థులు పాల్గొన్నారు.



## హమాలీ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

**ప్రజాపక్షం / జమ్మికుంట :** రాష్ట్రంలోని అన్ని రంగాల హమాలీ కార్మికులకు ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటియూసీ జిల్లా అధ్యక్షులు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్ డిమాండ్ చేశారు. జమ్మికుంట మండలం కోరపల్లిలో కరీంనగర్ జిల్లా కో ఆపరేటివ్ హమాలీ కార్మిక సంఘం జిల్లా సర్వసభ్య సమావేశం జమ్మికుంట మండల అధ్యక్షులు వంగ ఓదెలు అధ్యక్షతన జరిగింది. సమావేశానంతరం ఏఐటియూసి రాష్ట్ర నాలుగో మహా సభల కరపత్రాన్ని ఆవిష్కరించి మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బుచ్చన్న యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని కో ఆపరేటివ్ సొసైటీలో పని చేస్తున్న హమాలీ కార్మికులకు పని భద్రత లేకుండా పని కోల్పోయే ప్రమాదం ఏర్పడుతుందని తక్కువ కూలికి పని చేయాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు ప్రమాద భీమా సౌకర్యం, పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించే విధంగా కార్మిక శాఖ ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. హమాలీ కార్మికుల కోసం పని భద్రతతోపాటు వారికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ బోర్డు ద్వారా అనేక సంక్షేమ పథకాలు తీసుకురావాలని దీనిపై రాష్ట్ర మహాసభలో కో ఆపరేటివ్ హమాలీ కార్మికుల సమస్యలపై తీర్మాణం చేయడం జరుగుతుందన్నారు. ఈనెల 12న కరీంనగర్ లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏఐటియూసి జిల్లా మహాసభ జరగనున్నాయని దీనికి కార్యకర్తలు తరలిరావాలని కోరారు. సెప్టెంబర్ 6 నుంచి 8 వరకు కరీంనగర్‌లో జరిగే నాలుగో మహాసభల్లో జిల్లాలోని హమాలీ కార్మికులు వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కోరపల్లి యువ చైతన్య తాపీ సంఘం గౌరవ అధ్యక్షులు శంకర్, అధ్యక్షులు కనకం కుమార్, ఉపాధ్యక్షులు బోయిని సమ్మయ్య, టి.నర్సింగరావు సలహాదారులు ఇల్లందుల చందు, బోయిని అంకుశ్, పోచయ్యలతోపాటు దాదాపు 20 మంది కార్యకర్తలు ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు బుచ్చన్న ఆధ్వర్యంలో ఏఐటియూసిలో చేరారు.కోపరేటివ్ హమాలీ కార్మికు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మచనపల్లి శ్రీనివాస్ యుగేందర్, గిరివేణి రాజు, స్వామి, బీర్ల నరేశ్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



## సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పిన ఆల్ఫోర్స్

**ప్రజాపక్షం / కొత్తపల్లి :** ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాలల విద్యార్థులు విభావరి పేరుతో నిర్వహించిన కార్యక్రమం ద్వారా సాంస్కృతిక వైభవాన్ని చాటి చెప్పారు. కరీంనగర్ శుభం గార్డెన్స్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డా.వి.నరేందర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని నిరంతరం కృషి చేయాలని తద్వారా లక్ష్యాలను సాధించగలుగుతారని తెలిపారు. ఆల్ఫోర్స్ విద్యార్థులు అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నారని ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా అత్యధిక సీట్లు సాధించిందని హర్షం వ్యక్తం చేశారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ఆల్ఫోర్స్ విద్యా సంస్థలు ప్రణాళికలు రూపొందిస్తూ ఉత్తమ ఫలితాలు సాధిస్తూ చారిత్రాత్మక అడుగులు వేస్తుందన్నారు. 202526 విద్యా సంవత్సరంలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఈ సందర్భంగా ఘన సత్కారం చేశారు. వివిధ కళాశాలల ప్రిన్సిపల్స్,తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వామపక్ష విద్యార్థి సంఘాల బంద్ విజయవంతం

**ప్రజాపక్షం / జమ్మికుంట :** విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం వామపక్ష విద్యార్థి సంఘాల రాష్ట్ర కమిటీల పిలుపు మేరకు జూలై 10న చేపట్టిన విద్యా సంస్థల బంద్ జమ్మికుంట మండల కేంద్రంలో పూర్తిస్థాయిలో విజయవతం అయిందని తెలిపారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి అద్దునూరి విష్ణు, పిడిఎస్‌యూ మండల అధ్యక్షుడు అంగిడి దేవందర్ లు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా రంగాన్ని పూర్తిగా గాలికొదిలేసిందని రాష్ట్రంలో 27 వేల ప్రభుత్వ పాఠశాలల్లో 4 వేలకు పైగా స్కూళ్లను మూసేయాలని కుట్ర చేస్తుందన్నారు. ఇది పేద, మధ్య తరగతి విద్యార్థుల భవిష్యత్‌పై చేస్తున్న దాడి అని అన్నారు. మరోవైపు కార్పోరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలు ఫీజుల పేరుతో దోపిడీ చేస్తున్నాయని, ఫీజు నియంత్రణ చట్టం అమలు కావడం లేదని ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి పెద్దఎత్తున ఆందోళనలుచేపడతామని స్పష్టం చేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజు నియంత్రణ చేస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

## బంధాలు బలి.. భవిష్యత్తు శూన్యం !

**ప్రజాపక్షం/ఎడపల్లి :** నమ్మకం, ప్రేమ, పరస్పర గౌరవం పునాదిగా సాగాల్సిన వివాహ బంధాలు ఇటీవల కాలంలో దారుణమైన నేరాలకు వేదికగా మారుతున్నా యి. ఒకప్పుడు భార్యాభర్తల మధ్య విభేదాలు వస్తే విడాకుల వరకు మాత్రమే వెళ్లే పరిస్థితి ఉండేది. కానీ నేడు, క్షణిక సుఖాలు, వివాహేతర సంబంధాల మోజులో పడి కట్టుకున్న జీవిత భాగస్వామికి కడతేరుస్తున్న ఘాతుకాలు సభ్య సమాజానికి తీవ్రంగా కలవరపెడుతున్నాయి. ముఖ్యంగా నిజామాబాద్ జిల్లాలో ఇటీవల వెలుగుచూసిన ఘటనలు మానవ విలువల పతనానికి అద్దం పడుతున్నాయి.

### నిజామాబాద్ జిల్లాలో వరుస విషాదాలు...

ఇటీవల నిజామాబాద్ జిల్లాలో చోటుచేసుకున్న ఘటనలు స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించాయి. మోపాల్ మండలం న్యాల్‌కల్ లో తన అక్రమ సంబంధానికి భర్త ప్రశాంత్ అడ్డుగా ఉన్నాడని భావించి, భార్య తన ప్రియుడితో కలిసి ఆయన్ను డాబాపై నుంచి తోసేసింది. తీవ్ర గాయాలతో భర్త ఆస్పత్రి పాలు కాగా టాయిలెట్ క్లీనర్ హార్పిక్ ను సిరంజ్ ద్వారా ఎక్కించి దారుణంగా హత్య చేసింది. ఇదే జిల్లాలో బోధన్ డివిజన్ పరిధిలోని ఎడపల్లి మండలం అంబం(వై) గ్రామంలో ఓనే మహిపాల్(28) అనే యువకుడి అనుమానస్పద మృతి కేసు సామాజిక బాధ్యతను ప్రశ్నించేలా చేసింది. వివాహేతర సంబంధం కారణంగానే మహిపాల్ ఆత్మహత్య చేసుకునేలా భార్య స్వరూప, ఆమె ప్రియుడు స్థానిక సర్పంచ్ భర్త గోపరి సుమన్ ప్రేరేపించినట్లు పోలీసులు నిర్ధారించారు. ప్రస్తుతం నిందితులు జైలు పాలు కాగా, ఒక ప్రజాప్రతినిధి కుటుంబమే ఇలాంటి ఘాతుకానికి పాల్పడటంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు ఎన్నో చోటుచేసుకుంటున్న తరుణంలో వివాహాలు చేసుకోవాలంటేనే యువతీ యువకులు భయపడుతున్నారు.

### సాంకేతికతతో వీడుతున్న మిస్టరీలు..

గతంలో ఇలాంటి నేరాలను ప్రమాదాలుగానో, సహజ మరణాలుగానో చిత్రీకరించి తప్పించుకునే ప్రయత్నం చేసేవారు. కానీ ప్రస్తుత ఆధునిక కాలంలో పోలీసులు సాంకేతికతను జోడించి నిజాన్ని నిగ్గుతేల్చుతున్నారు. మొబైల్ కాల్ డేటా, లోకేషన్ ట్రాకింగ్, సీసీటీవీ పుటేజీలు, ఫోరెన్సిక్ ల్యాబ్ ఆధారాలు వీటి సహాయంతో నేరస్తులు ఎంత తెలివిగా ప్లాన్ చేసినా చట్టం ముందు మోకరిల్లక తప్పడం లేదు. ఎన్సిఆర్‌బి నివేదికల ప్రకారం భారతదేశంలో జరుగుతున్న హత్యలలో దాదాపు పది శాతం హత్యలు అక్రమ సంబంధాలు, వివాహేతర వివాదాలు, ప్రేమ వ్యవహారాల వల్లే జరుగుతుండటం గమనార్హం.

### అనాథలవుతున్న పిల్లలు విచ్ఛిన్నమవుతున్న కుటుంబాలు

ఈ క్షణిక ఉద్వేగాల వల్ల జరిగే నేరాల వెనుక అతిపెద్ద బాధితులు అమాయక పిల్లలే ఒకవైపు తండ్రి ప్రాణాలు కోల్పోగా, మరోవైపు తల్లి జైలు పాలు కావడంతో కన్న పిల్లల భవిష్యత్తు పూర్తిగా ప్రశ్నార్థంగా మారుతోంది. సమాజంలో వారు ఎదుర్కొనే అవమానాలు, మానసిక క్షోభ వర్ణనాతీతం. సమస్యలకు హత్యలు లేదా ఆత్మహత్యలు పరిష్కారం కావు. ఇలాంటి పరిస్థితుల నుంచి బయటపడటానికి నిపుణులు, చట్టం సూచిస్తున్న మార్గాలు అనుసరించాలని పోలీసులు కోరుతున్నారు. దంపతుల మధ్య మనస్పర్థలు లేదా అనుమానాలు ఉంటే అనుభవజ్ఞులైన కౌన్సిలర్లు లేదా కుటుంబ పెద్దల సమక్షంలో చర్చించుకోవడం ఉత్తమమని, బంధం కలిసి సాగదు అనుకున్నప్పుడు చట్టబద్ధంగా విడాకులు తీసుకోవడం మంచిదే కానీ చట్టాన్ని చేతిలోకి తీసుకోకూడదని పేర్కొన్నారు. ఇలాంటి నేరాలకు పాల్పడే వారికి చట్ట ప్రకారం జీవిత జైలు లేదా మరణశిక్ష పడే అవకాశం ఉంది.

### విలువలు కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిది..

మానవ సంబంధాల విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉంది. క్షణిక మోహాల కోసం జీవితాలను బుగ్గిపాలు చేసుకోకుండా, వివేకంతో ఆలోచించినప్పుడే కుటుంబ వ్యవస్థ నిలబడుతుంది. సమాజం ప్రశాంతంగా ఉంటుంది.

## విద్య నుంచి విజ్ఞానానికి ఎఐ ఎక్స్‌పోతో కొత్త అధ్యాయం

**ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ :** కరీంనగర్ సీతారాంపూర్‌లోని ఐవివై సిద్ధార్థ విద్యా సంస్థల ఆధ్వర్యంలో జూలై 11న విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సాంకేతిక నైపుణ్యాలు, పరిశోధనా ఆసక్తిని పెంపొందించే లక్ష్యంతో భారీ రోబోటిక్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఎక్స్‌పోను నిర్వహిస్తున్నారు. ఐవివై విద్యా సంస్థల చైర్మన్ పసుల మహా, కో చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి లు మాట్లాడుతూ భవిష్యత్ ప్రపంచానికి అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులు చిన్న వయస్సు నుంచే అలవర్చుకోవాలని అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రోబోటిక్స్ వంటి ఆధునిక సాంకేతిక రంగాల్లో విద్యార్థులను ప్రోత్సహించేందుకే ఈ ఎక్స్‌పోను నిర్వహిస్తున్నామని పుస్తకాల పరిజ్ఞానంతో పాటు ప్రయోగాత్మక విద్య కూడా అవసరమని పేర్కొన్నారు. ఈ ఎక్స్‌పో విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథాన్ని, సృజనాత్మకతను, సమస్య పరిష్కార సామర్థ్యాన్ని పెంపొందిస్తుందని తెలిపారు.